# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-03-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్ లో 2047 నాటికి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే పీ4 లక్ష్యమని పేర్కొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.**

**2.** **రాష్ట్రంలో పాడిపరిశ్రమ బలోపేతానికి సుస్థిర పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి పట్టభద్రులు కృషి చేయాలన్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్.**

**3.** **కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి నిర్మాణం వేగంగా జరుగుతోందని వెల్లడించిన ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ.**

**4.** **ఆంధ్రప్రదేశ్ లో వంట గ్యాస్ కొరత లేదని, పుకార్లను నమ్మవద్దని సూచించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.**

**5.** **కలుపు మొక్కల నివారణకు వినియోగించే పారాక్వాట్ మందును నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన తెలంగాణ ప్రభుత్వం.**

=========================

ఆంధ్రప్రదేశ్ లో 2047 నాటికి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం -పీ4 లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పీ4 వార్షికోత్సవంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం మార్గదర్శులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఏడాది కాలంలో 1.06 లక్షల మంది మార్గదర్శులు 10.30 లక్షల కుటుంబాలను దత్తత తీసుకున్నారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో పాడిపరిశ్రమ బలోపేతానికి సుస్థిర పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి పశు వైద్య విద్యా పట్టభద్రులు కృషి చేయాలని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో గవర్నర్ నిన్న పాల్గొని వివిధ కోర్సులు పూర్తి చేసిన 415మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, పాడిపరిశ్రమ అభివృద్ధిలో సవాళ్ల

పరిష్కారానికి నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి నిర్మాణం వేగంగా జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి నిన్న ప్రారంభించారు. హడ్కో ద్వారా 11 వేల కోట్లు, నాబార్డ్ ద్వారా 7,500 కోట్లు, ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి 15 వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందుతోందని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

కలుపు మొక్కల నివారణకు గడ్డి మందుగా పిలిచే పారాక్వాట్‌ను శాశ్వతంగా నిషేధించాలని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తెలంగాణ శాసనసభలో నిన్న తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పారాక్వాట్ మందు మానవాళికి, పర్యావరణ పరిరక్షణకు ముప్పుగా మారిందని చెప్పారు. దీన్ని వినియోగిస్తున్నప్పుడు పీల్చడం వల్ల రైతులు, కూలీలు చర్మ, శ్వాస సమస్యల బారినపడుతున్నారని తెలిపారు. ఇప్పటికే 70 దేశాలు పారాక్వాట్ మందును నిషేధించాయని ఆ మందు తయారీ, దిగుమతి, వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని.. అందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఈ తీర్మానాన్ని తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వంట గ్యాస్ కొరత లేదని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లను ప్రజలు నమ్మవద్దని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నెల్లూరులో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇటీవల విశాఖపట్నానికి ద్రవీకృత పెట్రోలియం వాయువు- ఎల్‌పీజీ నౌక చేరడంతో గ్యాస్ సరఫరాకు ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ సరఫరాను పెంచిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్రోల్ కొరత కూడా లేదని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

---------------------------

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు సంపద సృష్టి ముఖ్యమని విజయనగరం జిల్లా ఇన్చార్జి మంత్రి వి.అనిత తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆమె నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ.... జిల్లాకు వివిధ శాఖల ద్వారా సుమారు 3 వేల కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని, వాటిని సద్వినియోగం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేసేందుకు 118 కోట్ల రూపాయలతో భూసేకరణకు ప్రతిపాదించామని మంత్రి అనిత తెలియజేస్తూ...

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

తెలంగాణలో వాహనాలకు ద్రవీకృత పెట్రోలియం వాయువు – ఎల్పీజీ సరఫరా పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఎల్పీజీ సరఫరాదారులతో మంత్రి నిన్న అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ –ఐఓసీఎల్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ –హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు గ్యాస్ సరఫరాను పెంచాలని కోరారు. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హార్దీప్‌సింగ్ పూరీకి లేఖ రాస్తానని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో 2035 నాటికి 2.10 సంతానోత్పత్తి రేటు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.50గా ఉందని ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త జనాభా స్థిరీకరణ విధానాన్ని రూపొందించిందని చెప్పారు. సంతాన రేటు తగ్గటంతో శ్రామిక శక్తి తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరగడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. మాతృత్వం, సంజీవని, శక్తి, క్షేమం, నైపుణ్యం వంటి ఐదు అంశాలతో జనాభా స్థిరీకరణ ప్రణాళికలు అమలు చేస్తామని వెల్లడించారు. జనాభా స్థిరీకరణకు ప్రజల సహకారం అవసరమని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతుల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం నడిపల్లికోటలో 23.95 లక్షల రూపాయలతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 'తల్లికి వందనం' ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం, 'విద్యార్థి మిత్ర' కింద అవసరమైన వస్తువులు అందిస్తున్నట్లు చెప్పారు.

---------------------------

ఉపరితల ఆవర్తనం ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈరోజు అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణాలోనూ రానున్న మూడురోజులపాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

======================